ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
03-01-2025
శుక్రవారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 113 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB
జయభేరి



# చర్లపల్లి రైల్వే టెర్మినల్ ముహూర్తం ఖరారు

## వర్చువల్‌గా రైల్వే టెర్మినల్‌ను ప్రారంభించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

రూ.413 కోట్లతో ఏర్పాటు చేసిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను గతేడాది డిసెంబర్ 28 ప్రారంభించేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిచెందడంతో కార్యక్రమం వాయిదా పడింది.మాజీ ప్రధాని మృతి కారణంగా వారం రోజులపాటు కేంద్ర ప్రభుత్వం సంతాప దినాలు ప్రకటించింది. ఈ మేరకు కార్యక్రమం వాయిదా పడింది.



2 లో



3 లో

## రైతుల కోసం పథకాలు



3 లో

## సీఎంఆర్ కాలేజీలో ఉద్రిక్తత




3 లో

## ప్రాణాపాయ స్థితిలోని రోగికి పునరుజ్జీవం

# ఎమ్మెల్యేల ప్రోగ్రెస్ రిపోర్ట్

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి న్యూ ఇయర్ సందర్భంగా తనను కలిసేందుకు వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలకు ప్రభుత్వ, పార్టీపరమైన అంశాలపై కీలక సూచనలు జారీ చేశారు. ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇకపై తాను ఎక్కువ సమయం పార్టీ నాయకులకు కేటాయించనున్నట్లు, స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.



2 లో



# ఏపి కేబినెట్..

## కీలక అంశాలపై ఆమోద ముద్ర

**జయభేరి, అమరావతి :**

ఏపీ కేబినెట్ సమావేశం ముగిసింది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 14 కీలక అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఏపీ రాజధాని అమరావతిలో 2733 కోట్ల పనులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అమరావతిలో రెండు ఇంజనీరింగ్ కాలేజీల పనులకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. అలాగే భవనాలు, లేఔట్‌ల అనుమతులను మున్సిపాలిటీలకు అప్పగిస్తూ చేసిన సవరణ ప్రతిపాదనకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. తిరుపతిలో ఈఎస్ఐ ఆస్పత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు పెంపు ప్రతిపాదనకు కేబినెట్ ఓకే చెప్పింది. పిఠాపురం ఏరియా డెవలెప్మెంట్ అథారిటీలో 19 నూతన పోస్టులకు అనుమతి

...మిగతాది 2 లో



# కారు గేరు మారుస్తారా..?

**జయభేరి, హైదరాబాద్, జనవరి 2:**

బీఆర్ఎస్ అధినేత గత ఏడాది ఎక్కడా కనిపించలేదు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా కేసీఆర్ ప్రచారానికి వచ్చారు. అన్ని జిల్లాల్లో పర్యటించారు. అయితే పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క సీటు కూడా బీఆర్ఎస్ సాధించలేకపోయింది. దీంతో కేసీఆర్ నాటి నుంచి ఎర్రవెల్లి లోని ఫాం హౌస్ కే

...మిగతాది 2 లో

# టాప్ గేర్ లో నార్త్ హైదరాబాద్



**జయభేరి, హైదరాబాద్, జనవరి 2:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న తాజా నిర్ణయంతో హైదరాబాద్ లోని ఉత్తర ప్రాంతంలో ఉన్న భూముల ధరలు మరింత పెరగనున్నాయి. ఇప్పటికే ఆ ప్రాంతంలో ధరలు ఆకాశాన్నంటాయి. తాజాగా తీసుకున్న నిర్ణయంతో ధరలు మరింత పెరిగే అవకాశముందని తెలిసింది. మేడ్చల్, కొంపల్లి, శామీర్ పేట్ వరకూ భూముల ధరలకు ఇక రెక్కలు వస్తాయి. అందుకు ప్రధాన కారణం మెట్రో రైలు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడమే. ఇప్పటికే ఈ ప్రాంతం విస్తరించింది. దాదాపు మేడ్చల్ వరకూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు వేశారు. అనేక చోట్ల ఈ ప్రాంతంలో వేసిన వెంచర్లు అలాగే ఉన్నాయి. అమ్ముడు పోవడం లేదు. సిటీకి రావాలంటే కష్టంగా మారడం వల్లనే ఈ ప్రాంతంలో కొనుగోలు చేయడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపడం లేదు. . కొత్త సంవత్సరం తొలి రోజు హైదరాబాద్ వాసులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు.

...మిగతాది 2 లో



# క్రీడా అవార్డులు ప్రకటించిన కేంద్రం

**జయభేరి, న్యూఢిల్లీ, జనవరి 2:**

పారిస్ ఒలింపిక్స్‌లో షూటింగ్‌లో రెండు పతకాలు సాధించి భారత షూటర్ మను బాకర్‌కు ఖేల్‌రత్న అవార్డు ప్రకటించింది కేంద్రం. మను భాకర్ తోపాటు ప్రపంచ చెస్ ఛాంపియన్ విజేత డి గుకేష్‌ను కూడా ఖేల్ రత్న అవార్డుతో కేంద్ర సత్కరించింది. యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ ఖేల్ రత్న అవార్డులు పొందే క్రీడాకారుల జాబితాను విడుదల చేసింది. మను భాకర్, డి గుకేష్, ప్రవీణ్ కుమార్‌కు మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డును ప్రకటించారు.

పారిస్ ఒలింపిక్స్ 2024లో హాకీ జట్టుకు కాంస్య పతకాన్ని అందించిన హర్మన్‌ప్రీత్ సింగ్ కూడా ఖేల్ రత్న అందుకోనున్నారు.

క్రీడాకారులు అవార్డు వచ్చిన గేమ్ పేరు
1 గుకేష్ డి చెస్
2 హర్మన్‌ప్రీత్ సింగ్ హాకీ
3 ప్రవీణ్ కుమార్ పారాఅథ్లెటిక్స్
4 మను భాకర్ షూటింగ్

అథ్లెట్ల ఈ అవార్డులను జనవరి 17, 2025 ఉదయం 11 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోనున్నారు. కమిటీలు సిఫార్సుల

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## ఎమ్మెల్యేల ప్రోగ్రెస్ రిపోర్ట్

న్యూ ఇయర్ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపేందుకు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన నివాసం వద్దకు తరలివచ్చారు. దీంతో సీఎం రేవంత్ రెడ్డి నివాసం సందడిగా మారింది. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం ప్రత్యేకంగా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యేల పనితీరుపై సర్వే రిపోర్ట్ లు తన వద్ద ఉన్నాయని, అలాగే తన రిపోర్టు కూడా తాను తెప్పించుకున్నట్లు సీఎం అన్నారు. ఎవరి ప్రోగ్రెస్ రిపోర్టు వారికి అప్పగించడం జరుగుతుందని, ప్రజలకు ప్రతి ఒక్కరు అందుబాటులో ఉండాలని సీఎం సూచించారు. ఏడాది పాలనలో తెలిసి తప్పు చేయలేదని, తెలియకుండా జరిగిన తప్పులపై చర్యలు తీసుకున్నామంటూ సీఎం అన్నారు. ఏడాది పాలనలో ఎన్నికల కోడ్ రావడంతో పూర్తిస్థాయి పాలన ఆరు నెలలు సాగినట్లుగా భావించాలని, కేవలం ఆరు నెలల్లో ప్రజా మద్దతును తమ ప్రభుత్వం సాధించిందన్నారు. ఏడాది పాలన అనుభవాలు, వచ్చే నాలుగేళ్లకు ఉపయోగపడతాయని, ప్రజా ప్రభుత్వంగా మన ప్రభుత్వం గుర్తింపు పొందేలా ప్రతి ఒక్కరు నడుచుకోవాలని సీఎం సూచించారు. ఈ దశలో అంగన్వాడీ, డీలర్ల నియామకంలో పార్టీ నాయకులకు అవకాశం ఇవ్వాలని ఓ మంత్రి కోరగా, ఆ విషయాన్ని సీఎం తిరస్కరించినట్లు తెలుస్తోంది. ఆన్లైన్లో దరఖాస్తులు తీసుకొని, పారదర్శకంగా నియామకాలు చేపట్టకపోతే తప్పుడు సంకేతాలు వెళ్తాయని సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్లు సమాచారం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల నియామకాలను చేపట్టేందుకు సాహసించలేదని, తమ ప్రభుత్వం పారదర్శకంగా ఉద్యోగాల భర్తీ ప్రక్రియను సాగించిందన్నారు. ఇకపై పార్టీ నాయకులకు ఎక్కువ సమయం కేటాయించేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందని, స్థానిక సంస్థల ఎన్నికలు కాంగ్రెస్ ప్రభుత్వానికి చాలా కీలకమంటూ ప్రజా ప్రతినిధులకు సీఎం సూచించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ప్రతి విషయం గురించి తన వద్ద సమాచారం ఉందని, పార్టీ బలోపేతానికి కూడా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు తెలంగాణలో మార్పు కోసం కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టినట్లు, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని కూడా సీఎం అన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో ప్రస్తుతం సానుకూల వాతావరణం ఉందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రజలు గుర్తించి ప్రభుత్వ ఇబ్బందులను అర్థం చేసుకున్నారన్నారు. ప్రతి ఒక్కరు తమ పనితీరును మరింతగా మెరుగుపరుచుకుని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి మద్దతు కూడబెట్టుకోవాలని సీఎం తెలిపారు.

## ఏపి కేబినెట్...

మంజూరు చేస్తూ మంత్రి మండలిలో ఆమోదం తెలిపారు. గుంటూరు జిల్లా, పత్తిపాడు మండలం, నదింపాలెం గ్రామంలో ఆరున్నర ఎకరాలు స్థలాన్ని 100 బెడ్ల ఈఎస్ఐసీ ఆసుపత్రి నిర్మాణానికి ఇస్తూ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటితో పాటు ఎజెండా పూర్తయ్యాక పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం చర్చించారు. ఎస్ఐపీబీ ఆమోదించిన 1,82,162 కోట్ల పెట్టుబడులకు సంబంధించి 2,63,411 మందికి ఉద్యోగాలు కల్పించే అంశంపై కూడా కేబినెట్ లో చర్చించారు. నెల్లూరు జిల్లా రామయ్యపట్నంలో 6 వేల ఎకరాల్లో రూ. 96,862 కోట్ల పెట్టుబడితో బీపీసీఎల్ భారీ రిఫైనరీ ఏర్పాటుకు ఏపీ మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో కొత్తగా ఐదు సంస్థలు క్లీన్ ఎనర్జీలో 83 వేల కోట్ల పెట్టుబడులకు ఆమోద ముద్ర పడింది. సూపర్ సిక్స్ పథకాలకు ఏపీ కేబినెట్ పచ్చ జెండా ఊపింది. వచ్చే విద్యాసంవత్సరంలోపు తల్లికి వందనం అమలు చేయాలి అని ఆర్థిక శాఖకు ఆదేశాలు జారీ చేసింది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్ని పథకాలు అమలు చేసి తీరుదామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. బకాయిలు ఎన్ని ఉన్నాయని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆరా తీయగా..లక్ష 30 వేల కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని మంత్రి పయ్యావుల కేశవ్ వివరించారు.

## కారు గేరు మారుస్తారా..?

పరిమితమయ్యారు. ఎవరైనా ఆయనను కలవాలనుకున్నా అక్కడకు వెళ్లాల్సిందే. తప్ప ఆయన బయటకు రావడం లేదు. ఇటీవల మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణించినా ఫాం హౌస్ నుంచి ఒక సంతాప ప్రకటన అయితే పంపారు తప్ప ఆయన మాత్రం బయటకు రాలేదు. నిజానికి మన్మోహన్ సింగ్ తో ఉన్న అనుబంధంతో ఆయన ఢిల్లీకి వెళ్లి నివాళులర్పించాల్సిన తరుణంలో ఫాం హౌస్ కే పరిమితమయ్యారు. మరొకవైపు అసెంబ్లీ సమావేశాలకు కూడా దూరంగా ఉన్నారు. బడ్జెట్ సమావేశాలకు రాలేదు. సరే..ఇటీవల మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం తెలిపేందుకు ప్రత్యేకంగా సమావేశమైన సభకు కూడా కేసీఆర్ హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది. తనకు మన్మోహన్ సింగ్ తో ఉన్న అనుబంధం ఆయన తన నోటి నుంచి చెప్పి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం అందరిలో ఉన్నా దూరంగానే ఉన్నారు. ఇక తెలంగాణలో అనేక కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఫార్ములా ఈ కారు రేసు కేసులో కేటీఆర్ ఏ 1 నిందితుడిగా ఉన్నారు. ఆయనపై ఇటు ఏసీబీ కేసు నమోదు చేసి విచారణ జరుపుతుంది. మరోవైపు ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు కూడా నోటీసులు జారీ చేశారు. ఈడీ అధికారులు అయితే ఈ నెల 7వ తేదీన విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు. ఏసీబీ అధికారులు కూడా ఈ కేసులో విచారించే అవకాశాలున్నాయి. అంతే కాదు అరెస్ట్ చేస్తారన్న ప్రచారం కూడా జరుగుతుంది. ఈ నేపథ్యంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా అంతా తానే అయి ఇన్ని రోజులు కార్యకర్తలకు భరోసాగా ఉన్న కేటీఆర్ కు నోటీసులు వచ్చిన సమయంలోనైనా కేసీఆర్ బయటకు రాకపోవడం గులాబీ పార్టీలో చర్చనీయాంశమైంది. అసలు కేసీఆర్ కు జనంలో తిరిగే ఆలోచన ఉందా? లేదా? అన్నది కూడా పార్టీలో తెలియకుండా ఉంది. కేసీఆర్ బయటకు వచ్చి జనంలో తిరిగితే కార్యకర్తలకు కూడా ధైర్యం కలుగుతుందని తెలిసినా ఫాం హౌస్ కే పరిమితమవ్వడమేంటన్న ప్రశ్న అందరిలోనూ కలుగుతుంది. ఈ సమయంలో కేసీఆర్ వచ్చి కనీసం మీడియా సమావేశం నిర్వహించి ప్రభుత్వంపై విమర్శలు చేస్తే ఇటు ప్రజల్లోనూ, అటు కార్యకర్తల్లోనూ ధైర్యం కలుగుతుందని, కానీ కనీసం ఆ పని కూడా చేయకపోతే ఎలా? అన్న ప్రశ్నలు గులాబీ పార్టీ నుంచి వినపడుతున్నాయి. అనేక మంది పార్టీ నేతలపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేస్తున్నా కేసీఆర్ బయటకు రాకపోవడంపై పార్టీలోనే ఒకింత నిరాశ నిస్పృహలు బయలుదేరాయి.

## టాప్ గేర్ లో నార్త్ హైదరాబాద్

మెట్రో రైలును మేడ్చల్ వరకూ పొడిగించాలని నిర్ణయించారు. ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకూ కారిడార్ ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టును తయారు చేయాలని ఆదేశించారు. డీపీఆర్ ను వెంటనే కేంద్ర ప్రభుత్వానికి పంపి ఆమోదం పొందేందుకు ప్రయత్నిస్తామని రేవంత్ రెడ్డి చెబుతున్నారు. ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకూ, షామీర్ పేట్ నుంచి జేబీఎస్ వరకూ వెంటనే రెండు కారిడార్లకు సంబంధించిన డీపీఆర్ లను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించడంతో నార్త్ హైదరాబాద్ లో ఉంటున్న వారికి నిజంగా ఇది అమలయ్యేతే కొత్త సంవత్సరం వేళ శుభవార్తే అవుతుంది.. ప్లాట్లు, ఫ్లాట్లు కొనుగోలు చేయాలంటే సాఫ్ట్ వేర్ ఇంజినీర్లు ముందుకు రావాలి. అయితే ఇక్కడ నివాసం ఉండి మాదాపూర్, గచ్చిబౌలికి రావాలంటే గంటల తరబడి ప్రయాణం తప్పదు. రోడ్డు మార్గంలో రావాలంటే ట్రాఫిక్ చిక్కుల్లో పడక తప్పదు. అంత దూరంలో ఉండి గంటల తరబడి ఇళ్లకు చేరుకోవడం సాధ్యం కానిపని. కార్యాలయాలన్నీ ఇటు వైపు ఉండగా నగర శివార్లలో ఉత్తరం వైపు ఉన్న ఆ ప్రాంతం వైపు ఉన్న ఫ్లాట్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి కనపర్చడం లేదు. అయినా ఇప్పటికే కొంపల్లి నుంచి హైవే ఉన్నందున కొంత మేర అక్కడ అభివృద్ధి ప్రారంభమయింది. చాలా డెవలెప్ అయింది. అనేక నిర్మాణాలు వెలిశాయి. కార్పొరేట్ సంస్థలు కూడా అక్కడ ఏర్పాటయ్యాయి. ఇక మెట్రో రైలు కూడా ఏర్పాటయితే ఇక అక్కడ భూముల ధరలు కొనలేని పరిస్థితి ఉంటుంది....ఎప్పటి నుంచో మేడ్చల్ వైపు కనీసం కొంపల్లి వరకూ అయినా మెట్రో రైలును విస్తరించాలని ఆ ప్రాంత వాసులు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. గత ప్రభుత్వం ఇటువైపు చూపిన శ్రద్ధ అటు వైపు పెట్టలేదన్న ఆగ్రహంతో ఉన్నారు. అయినా గత ఎన్నికల్లో మేడ్చల్ ఇతర ప్రాంతాల్లో తిరిగి బీఆర్ఎస్ పార్టీనే గెలిపించారు. అయితే రేవంత్ రెడ్డి కొత్త ఏడాది తీసుకున్న నిర్ణయంతో తమ ట్రాఫిక్ కష్టాలు తీరతాయని భావిస్తున్నారు. ప్రధానంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు కూడా ఖుషీ కబురు అందినట్లే ఫీలవుతున్నారు. మెట్రో రైలు ఏర్పాటయితే నగరం నడిబొడ్డుకు రాకపోకలు సాగించేందుకు సులువవుతుందని ఇక అమ్మకాలు ఊపందుకున్నాయన్న అంచనాలు వినిపిస్తున్నాయి.

**శామీర్ పేటకు మెట్రో**

మీర్ పేట్, మేడ్చల్ వరకు మెట్రో మార్గాలను పెంచాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. జేబీఎస్ నుండి శామీర్ పెట్ వరకు గల 22 కిలోమీటర్లు, ప్యారడైజ్ నుండి మేడ్చల్ వరకు 23 కిలోమీటర్ల మెట్రో మార్గానికి సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మెట్రో రైల్ ఫేజ్ – 2 బి భాగంగా డీపీఆర్ తయారు చేయాలని సీఎం మెట్రో అధికారులకు ఆదేశాలిచ్చారు. సీఎం తీసుకున్న నిర్ణయం పై మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు.

# రైతుల కోసం పథకాలు



**కొత్త ఏడాది రైతుల సంక్షేమానికి అనేక చర్యలు చేపట్టింది. ప్రకృతి వైపరీత్యాలతో తల్లడిల్లుతున్న రైతాంగాన్ని ఆదుకోవడానికి ప్రధాని ఫసల్ బీమా యోజన పరిధిని పెంచింది. ఇందుకు 69 వేల 515 కోట్లు ఈ పథకానికి కేటాయించింది. ఈ పథకంతో 4 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. అంతేకాకుండా పీఎం ఫసల్ బీమా యోజనలో మార్పులు చేశారు.**

23 రాష్ట్రాలకు, 4 కేంద్ర పాలిత ప్రాంతాలకు ఈ పథకంలో భాగస్వామ్యం ఉంది. అయితే బీమా చెల్లింపు విషయంలో ఈశాన్య రాష్ట్రాలకు 90 శాతం ప్రీమియంను కేంద్రమే భరించబోతోంది. మిగతా రాష్ట్రాల్లో 50 శాతం చెల్లిస్తారు.. మరోవైపు ఎరువులపై సబ్సిడీని పెంచింది కేంద్రం.. విపత్తు తీవ్రతను తగ్గించడానికి కృషి చేస్తునట్టు తెలిపారు కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్.. ఈ సంవత్సరాన్ని రైతు సంక్షేమ సంవత్సరంగా ప్రధాని మోదీ ప్రకటించారని అన్నారు. ఫసల్ బీమా యోజన రైతు జీవితాల్లో గణనీయమైన మార్పును తెచ్చిందన్నారు. రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం 11.9 లక్షల కోట్లు గత పదేళ్లలో ఖర్చు చేసినట్టు వెల్లడించారు. అంతేకాదు 2025లో తొలి క్యాబినెట్ భేటీని ప్రధాని మోదీ రైతులకు అంకితం చేసింది కేంద్రంఇక డీఏపీపై అదనపు భారాన్ని కేంద్రమే భరించనుంది. ఇకపై ఒక 50 కిలోల డీఏపీ బస్తా 1350 రూపాయలకే లభ్యం కానుంది. కేంద్రం తాజాగా తీసుకున్న ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా 4 కోట్ల మంది రైతులకు లబ్ధి చూకూరనుంది. అదే విధంగా ఫండ్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ'కి కేంద్రం రూ.800 కోట్ల నిధిని ఏర్పాటు చేసింది. పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకం కింద అందించే మొత్తాన్ని రూ.6 వేల నుంచి రూ.10 వేలకు పెంచాలని నిర్ణయించింది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో నిర్వహించిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. క్యాబినెట్ నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేస్తూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు ప్రధానిమోదీ. రైతుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉన్న ప్రభుత్వం తమదేనని.. దేశానికి అన్నం పెట్టేందుకు శ్రమించే మన రైతులు గర్వకారణమన్నారు.

2025 మొదటి క్యాబినెట్ భేటీని రైతుల శ్రేయస్సు కోసం అంకితం చేయడం...ఆనందంగా ఉందన్నారు మోదీ. 2014లో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేసి 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చింది. అయితే, భూస్థాయిలో ఉన్న వాస్తవాలు మాత్రం వ్యవసాయ విధానాల్లో ఉన్న లోపాలను, కార్పొరేట్ లాభాలను కాపాడే విధానాలను, ప్రతిపక్షాల గళాన్ని అణిచివేసే ప్రభుత్వ వైఖరిని వెల్లడించాయి. ప్రభుత్వం ప్రారంభంలోనే రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కొన్ని పథకాలను ప్రవేశపెట్టింది. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి వంటి పథకాలు రైతులకు ఏడాదికి రూ. 6,000 సాయం అందజేయడం ద్వారా ఆర్థిక ఒత్తిడిని తగ్గించడమే లక్ష్యంగా ప్రవేశపెట్టబడ్డాయి. భూమి ఆరోగ్య కార్డులు, ప్రధానమంత్రి పంట భీమా యోజన వంటి పథకాలు సుస్థిర వ్యవసాయానికి, పంట నష్టాల



**2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న లక్ష్యం దూరమైంది. జాతీయ నమూనా సర్వే కార్యాలయం (ఎన్ఎస్ఎస్ఒ) ప్రకారం, వ్యవసాయ కుటుంబం సగటు నెలసరి ఆదాయం కేవలం రూ. 10,218 మాత్రమే. ఇది బతుకుదెరువుకు సరిపడటం లేదు. 2020లో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు ఈ సమస్యలను మరింతగా వేగవంతం చేశాయి.**

నుంచి రక్షణకు ఉపయోగపడతాయని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టులు, శీతల గిడ్డంగుల వంటి మౌలిక సదుపాయాలలో పెట్టుబడులు వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించే ప్రయత్నంగా గొప్పగా చాటుకున్నారు. కానీ, ఈ చర్యలు పరిమిత ప్రభావాన్ని మాత్రమే చూపించాయి. పిఎం కిసాన్ పథకం ద్వారా కొంతమంది రైతులకే లబ్ధి కలిగింది. అయితే కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు వంటి వారు పూర్తిగా ఈ పథకాల పరిధికి దూరంగా ఉన్నారు. పంట భీమా పథకాలు చాలా సందర్భాల్లో రైతులకు న్యాయమైన పరిహారం అందించలేకపోయాయి. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న లక్ష్యం దూరమైంది. జాతీయ నమూనా సర్వే కార్యాలయం (ఎన్ఎస్ఎస్ఒ) ప్రకారం, వ్యవసాయ కుటుంబం సగటు నెలసరి ఆదాయం కేవలం రూ. 10,218 మాత్రమే. ఇది బతుకుదెరువుకు సరిపడటం లేదు. 2020లో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు ఈ సమస్యలను మరింతగా వేగవంతం చేశాయి. వీటిని సంస్కరణలుగా ప్రచారం చేసినప్పటికీ, రైతులు వీటిని తమ జీవనోపాధిపై నేరుగా దాడిగా చూశారు. కనీస మద్దతు ధర (ఎంఎస్పి) వ్యవస్థను బలహీనపరచడం, వ్యవసాయ మార్కెట్లను కార్పొరేట్ సంస్థలకు అందుబాటులోకి తీసుకురావడం వంటి అంశాలు చిన్న రైతులను పెను ప్రమాదంలోకి నెట్టేశాయి. ఈ చట్టాలపై రైతుల నిరసనలు విరుచుకుపడ్డాయి. ముఖ్యంగా పంజాబ్, హర్యానా, ఉత్తర ప్రదేశ్ ప్రాంతాల రైతులు ఢిల్లీకి చేరి ఏడాదిన్నరపాటు శాంతియుత నిరసనలు కొనసాగించారు. కానీ ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించడానికి బదులుగా, కఠినమైన చర్యలను తీసుకుంది. నిరసనకారులపై టియర్ గ్యాస్, వాటర్ కాన్నన్‌లు వాడటంతో పాటు, 750 మందికి పైగా రైతులు అకాల మరణాల పాలయ్యారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చివరికి ఈ చట్టాలను 2021 నవంబరులో వెనక్కి తీసుకున్నప్పటికీ, రైతుల ప్రధాన డిమాండ్లలో ఒకటైన స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను ఇప్పటికీ అమలు చేయలేదు. పంటల ఉత్పత్తి ఖర్చును 1.5 రెట్లు ఎంఎస్పిగా నిర్ణయించడం వంటి అంశాలు ఇంకా ఎదురుచూస్తూనే ఉన్నాయి. రైతుల ఆర్థిక సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదు. భారత దేశంలో 86 శాతం మంది రైతులు రెండు హెక్టార్ల కంటే తక్కువ భూమిని కలిగి ఉన్న చిన్న రైతులే. వీరు పెరుగుతున్న ఖర్చులు, సంస్థాగత రుణాల లభ్యతలో లోపం, మార్కెట్ లో అస్థిరత వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు ప్రభుత్వం తన ప్రాధాన్యతలను మారుస్తూ, రైతు జీవనోపాధిని సురక్షితంగా చేయడానికి దిశానిర్దేశం చేయాలి. వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులకు పథకాలు అందుబాటులోకి తెచ్చి, ఆర్థిక న్యాయం చేయాలి. రైతుల డిమాండ్లను తీర్చి, సమర్థనీయమైన వ్యవసాయ విధానాలను అమలు చేయడం ద్వారా మాత్రమే ఒక ప్రజాస్వామ్య భారతదేశం ఆవిర్భవించగలదు.

## క్రీడా అవార్డులు ప్రకటించిన కేంద్రం

మేరకు మను భాకర్, డి గుకేష్, హర్మన్‌ప్రీత్ సింగ్, పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్‌ను ఖేల్ రత్నతో సత్కరించనుంది. కొన్ని రోజుల క్రితం ఖేల్ రత్న అవార్డు సిఫార్సు చేసిన అథ్లెట్ల జాబితాలో మను భాకర్ పేరు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. బహుశా తన వైపు నుంచే తప్పు జరిగిందని మను స్వయంగా అంగీకరించింది.
ధాన్‌య్‌ఖేల్‌రత్న అవార్డులతోపాటు 32 మందికి అర్జున్ అవార్డులను కూడా కేంద్రం ప్రకటించింది. ఆ వివారలు ఇలా ఉన్నాయి.

అర్జున అవార్డు 2024 అందుకున్న క్రీడాకారులు

1 జ్యోతి యర్రాజీ(అథ్లెటిక్స్)
2 అన్నూ రాణి (అథ్లెటిక్స్)
3 నీతు (బాక్సింగ్)
4 సావీటీ బాక్సింగ్
5 వంటికా అగర్వాల్ (చెస్)
6 సలీమా టెటె (హాకీ)
7 అభిషేక్ (హాకీ)
8 సంజయ్ (హాకీ)
9 జర్మన్‌ప్రీత్ సింగ్ (హాకీ)
10 సుఖజీత్ సింగ్ (హాకీ)
11 రాకేష్ కుమార్ (పారా ఆర్చరీ)
12 ప్రీతి పాల్ (పారాఅథ్లెటిక్స్)
13 జీవన్‌జీ దీప్తి (పారాఅథ్లెటిక్స్)
14 అజీత్ సింగ్ (పారాఅథ్లెటిక్స్)
15 సచిన్ సర్జేరావు ఖిలారీ (పారాఅథ్లెటిక్స్)
16 ధరంబీర్ (పారాఅథ్లెటిక్స్)
17 ప్రణవ్ సూర్మ (పారాఅథ్లెటిక్స్)
18 హెచ్ హోకాటో సెమా (పారాఅథ్లెటిక్స్)
19 సిమ్రాన్ (పారాఅథ్లెటిక్స్)
20 నవదీప్ (పారాఅథ్లెటిక్స్)
21 నితేష్ కుమార్ (పారాబ్యాడ్మింటన్)
22 తులసిమతి మురుగేషన్ (పారాబ్యాడ్మింటన్)
23 నిత్య శ్రీ సుమతి శివన్ (పారాబ్యాడ్మింటన్)
24 మనీషా రామదాస్ (పారాబ్యాడ్మింటన్)
25 కపిల్ పర్మార్ (పారాజూడో)
26 మోనా అగర్వాల్ (పారాషూటింగ్)
27 రుబీనా ఫ్రాన్సిస్ (పారాషూటింగ్)
28 స్వప్నిల్ సురేష్ కుసలే (షూటింగ్)
29 సరబ్జోత్ సింగ్ (షూటింగ్)
30 అభయ్ సింగ్ (స్క్వాష్)
31 సజన్ ప్రకాష్ (స్విమ్మింగ్)
32 అమన్ (రెజ్లింగ్)

2024 క్రీడల్లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన వారికి శిక్షణ ఇచ్చిన వారికి లైఫ్‌టైం ఎచ్చీవ్‌మెంట్ అర్జున అవార్డు ప్రకటించింది.
సుచాసింగ్ (అథ్లెటిక్స్) మురళీకాంత్ రాజారామ్ పేట్కర్ (పారాస్విమ్మింగ్) ఐదుగురు కోచ్‌లకు ద్రోణాచార్య అవార్డు లభించింది.

1 సుభాష్ రాణా (పారాషూటింగ్ రెగ్యులర్)
2 దీపాలి దేశ్‌పాండే (షూటింగ్ రెగ్యులర్)
3 సందీప్ సాంగ్వాన్ (హాకీ రెగ్యులర్)
4 ఎస్ మురళీధరన్ (బ్యాడ్మింటన్) జీవిత కాల సాఫల్య పురస్కారం
5 అర్మాండో అగ్నెలో కొలాకో (ఫుట్ బాల్) జీవితకాల సాఫల్య పురస్కారం

రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారాన్ని కూడా కేంద్రం ప్రకటించింది. ఇది అవార్డును ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియాకు అందించింది.

## చర్లపల్లి రైల్వే టెర్మినల్ ముహూర్తం ఖరారు



- వర్చువల్‌గా రైల్వే టెర్మినల్‌ను ప్రారంభించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

**జయభేరి, హైదరాబాద్, జనవరి 2:**

చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవం తేదీ ఖరారైంది. జనవరి 6వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా రైల్వే టెర్మినల్‌ను ప్రారంభించనున్నారు. రూ.413 కోట్లతో ఏర్పాటు చేసిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను గతేడాది డిసెంబర్ 28 ప్రారంభించేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిచెందడంతో కార్యక్రమం వాయిదా పడింది. మాజీ ప్రధాని మృతి కారణంగా వారం రోజులపాటు కేంద్ర ప్రభుత్వం సంతాప దినాలు ప్రకటించింది. ఈ మేరకు కార్యక్రమం వాయిదా పడింది. అయితే తాజాగా జనవరి 6వ తేదీన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, కిషన్ రెడ్డి నేరుగా పాల్గొనగా.. ప్రధాని మోదీ మాత్రం వర్చువల్‌గా హాజరై రైల్వే టెర్మినల్‌ను ప్రారంభిస్తారు. అయితే రెండు నెలల్లో మొత్తం నాలుగు సార్లు టెర్మినల్ ప్రారంభోత్సవం వాయిదా పడడం రైల్వే వర్గాలను తీవ్రంగా నిరాశపరిచింది. మరో కొత్త తేదీ ప్రకటించడంతో ఈసారైనా ఎలాంటి అవాంతరాలూ లేకుండా కార్యక్రమం జరగాలని రైల్వే అధికారులు, తెలంగాణ వాసులు కోరుకుంటున్నారు.

**ప్రత్యేకతలివే..**


జనవరి 6న చర్లపల్లి టెర్మినల్ ప్రారంభమైతే సుమారు 50 వేల మంది ప్రయాణికులకు మోక్షం లభిస్తుంది. గంటల తరబడి ట్రాఫిక్ సమస్య నుంచి వారికి విముక్తి కలుగుతుంది. చర్లపల్లి వద్ద ప్రస్తుతం 26 రైళ్లు ఆగుతుండగా.. ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే ప్రతి రోజూ 50 రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. దీంతో వేగంగా గమ్య స్థానాలకు వెళ్లే అవకాశం ఉంటుంది. రైల్వే అధికారులు ప్రస్తుతం ఇక్కడ 2 ఎంఎంటీఎస్ ప్లాట్‌ఫాంలతో కలిపి మొత్తం 9 ప్లాట్‌ఫాంలు, 6 ఎస్కలేటర్లు, 2 ఫుట్ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేశారు. అలాగే ప్రయాణికుల కోసం వెయిటింగ్ ఏసీ, నాన్ ఏసీ హాల్స్, ఫుడ్ కోర్టులు, రెస్టారెంట్లు, ఉచిత వైఫై సౌకర్యం కల్పించేందుకు ప్రణాళికలు రచించారు.

# ప్రాణాపాయ స్థితిలోని రోగికి పునరుజ్జీవం

- కేర్ ఆస్పత్రి వైద్యుల ఘనత

**జయభేరి, హైదరాబాద్, జనవరి 02:**

పలుమార్లు గుండెపోటుకు గురై ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చేరిన వృద్ధురాలైన మహిళా రోగి (68) కి కేర్ ఆస్పత్రి వైద్యులు పునరుజ్జీవం అందించారు. అతి బలహీనంగా ఉన్న గుండె పని తీరును సరి చేయడంతో పాటు అవసరమైన అధునాతన వైద్య చికిత్స అందించడం ద్వారా రోగిప్రాణాలను నిలబెట్టారు. బహుళ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నగరానికి చెందిన మహిళా రోగి, నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య చికిత్స పొందుతూ ఒక్కసారిగా తీవ్రమైన హృద్రోగానికి గురయ్యారు, దీంతో ఆమె కుటుంబీకులు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం రోగిని బంజారాహిల్స్ లోని కేర్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో కేర్ ఆస్పత్రి వైద్యులు డా. వి. సూర్యప్రకాశరావు, వారి వైద్య బృందం రోగి గుండె పనితీరును పరీక్షించారు. వైద్య పరీక్షల ద్వారా ఆరోగ్య స్థితిని అంచనా వేశారు. రోగి గుండె కేవలం 25% మాత్రమే రక్తాన్ని సరఫరా చేస్తుందని గుర్తించారు. అంతేగాక ప్రాణాంతక అరిథ్మియా వల్ల వెంట్రిక్యులర్ టాకికార్డియా (వీటీ), వెంట్రిక్యులర్ ఫైబ్రిలేషన్ (విఎఫ్) ఇబ్బందులతో రోగి ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు గుర్తించారు. బహుళ అనారోగ్య సమస్యలు, గుండెపోటు, మధుమేహానికి సంబంధించిన కార్డియోమయోపతి వంటి కారణాలతో ఈ దుస్థితి నెలకొని ఉండొచ్చని అంచనా వేశారు. ఈ క్రమంలో వైద్యులు రోగికి వైద్య చికిత్స ప్రారంభించారు. రోగి ఆరోగ్య పరిస్థితిని స్థిరీకరించడానికి తొలుత రోగిని ఇంట్రా అయోర్టిక్ బెలూన్ పంప్ (ఐఏబిపి) పరికరంలో.. వెంటిలేటర్ సాయంతో ఉంచారు. అయినప్పటికీ ఆమె హృదయ స్పందనలు అసాధారణంగానే కొనసాగాయి. దీంతో క్రమ రహిత హృదయ స్పందనలను క్రమబద్ధం చేసేందుకు 'స్టెలేట్ గ్యాంగ్లియన్ బ్లాక్' వైద్య చికిత్సను అందించారు.



కేర్ ఆస్పత్రి క్లినికల్ డైరెక్టర్, కార్డియాలజీ విభాగాధిపతి డా. వి. సూర్యప్రకాశరావు ఈ క్రమంలో పలుమార్లు కార్డియోవెర్షన్, అధునాతన ఫార్మాకోథెరపీ అందించడం ద్వారా రోగి ఆరోగ్య స్థితిని సాధారణ స్థాయికి తెచ్చారు. ఆరోగ్యం మెరుగైన తర్వాత రోగికి 'స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ కార్డియాక్ రీ సింక్రోనైజేషన్ థెరపీ డిఫిబ్రిలేటర్' (సి ఆర్ టి డి) అమర్చారు. ఈ అధునాతన పరికరం ఆమె హృదయ స్పందన నియంత్రించడంలో సహాయ పడటమే గాక గుండె నుంచి రక్త సరఫరా పనితీరును మెరుగుపరచడంలో సైతం సాయం అందిస్తుంది. తదనుగుణంగా రోగి ఆరోగ్య స్థితి సాధారణ స్థాయికి చేరింది. ఈ సందర్భంగా కేర్ ఆస్పత్రి క్లినికల్ డైరెక్టర్, కార్డియాలజీ విభాగాధిపతి డా. వి. సూర్యప్రకాశరావు మాట్లాడుతూ, రోగి గుండె స్థితిని స్థిరీకరించడంలో, ఆమె కోలుకునేలా చేయడంలో ఆసుపత్రికి చెందిన వివిధ విభాగాల వైద్య బృందం సమన్వయంతో కృషి చేసిందని చెప్పారు. సంక్లిష్టమైన, ప్రాణాలను రక్షించే గుండె సంరక్షణను అందించడంలో కేర్ ఆస్పత్రి నిబద్ధతకు ఈ కేసు ఒక ఉదాహరణ అని తెలిపారు. కేర్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. అజిత్ సింగ్, జోనల్ చీఫ్ ఆపరేటింగ్ అధికారి బిజు నాయర్ మాట్లాడుతూ, ప్రాణాపాయ స్థితిలోని రోగికి విజయవంతంగా వైద్య చికిత్స అందించడంలో వైద్యుల నైపుణ్యం ఉందన్నారు. రోగికి వైద్య సేవలు అందించిన వైద్య బృందంలో డా. వి. సూర్యప్రకాశరావు, డా. ఎస్. రాహుల్ అగర్వాల్, డా. టీవీఎస్ గోపాల్, డా. ఎస్ వి కే రామకృష్ణ, వైద్య సిబ్బంది ఉన్నారు.



## కాలనీ అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని హామీ

- సొంత నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన మాజీ ఎంపీటీసీ సరసం అశోక్ రెడ్డి

**జయభేరి, జనవరి 2:**

ప్రజయ్ హోమ్స్ కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని మజీద్ పూర్ గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యుడు సరసం అశోక్ రెడ్డి అన్నారు. గురువారం గత కొన్ని సంవత్సరాలుగా అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ మరమ్మత్తులు చేయక సుమారు ఒక 100 గృహాలకు సంబంధించిన ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నందున గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యుడు సరసం అశోక్ రెడ్డి రెండు లక్షల 50 వేల రూపాయలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులకు శంకుస్థాపన చేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజయ్ హోమ్స్ కాలనీ అభివృద్ధి కోసం శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. అనంతరం కాలనీవాసులు మాట్లాడుతూ కాలనిలో దుర్గంధం వెదజల్లుతుండటం వల్ల దోమలు వ్యాప్తి చెందుతూ వ్యాధుల బారిన పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను మాజీ ఎంపీటీసీ సభ్యులు అశోక్ దృష్టికి తీసుకువెళ్ళగా ఆయన సానుకూలంగా స్పందించి పనులు చేయించడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రజయ్ హోమ్స్ కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్, మండల కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి తుంకి రమేష్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి, ఎమ్మెల్యేను కలిసిన మున్సిపల్ చైర్మన్



**జయభేరి, గజ్వేల్, జనవరి 02 :**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గురువారం మాజీ మంత్రి హరీష్ రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి లను హైదారాబాద్ లో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన సంవత్సరం సందర్భంగా మంత్రి హరీష్ రావును ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందని అన్నారు.

# సిఎంఆర్ కాలేజీలో ఉద్రిక్తత

- ఆందోళనలకు దిగిన విద్యార్థినిలు..
- కేసు నమోదు చేసుకున్న పోలీసులు

**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ సీఎంఆర్ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద తీవ్ర ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. గర్ల్స్ హాస్టల్ ఎదుట విద్యార్థినిలు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. హాస్టల్ బాత్ రూముల్లో సీసీ కెమెరాలు పెట్టారంటూ విద్యార్థినిలు ఆందోళన బాట పట్టారు. తాము స్నానం చేస్తుండగా వీడియోలు రికార్డు చేస్తున్నారంటూ సంచలన ఆరోపణలు చేస్తున్నారు. విద్యార్థినిల ఆందోళనతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. వారి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు. అయితే హాస్టల్ లో వంట చేసే వారిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. కాగా ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది.




సీఎంఆర్ కాలేజీలోని ఉమెన్స్ హాస్టల్ బాత్‌రూమ్‌లో గుర్తుతెలియని దుండగులు కెమారాలు పెట్టి వీడియో తీశారనే ఆరోపణలు రాష్ట్రంలో సంచలనంగా మారాయి. దీంతో కళాశాలలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ ఘటనపై నిన్న(బుధవారం) రాత్రి విద్యార్థినులు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. విద్యార్థులతో పాటు విద్యార్థి సంఘాలు కూడా పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాయి. విద్యార్థుల ఆరోపణలతో హాస్టల్ వార్డెన్ ప్రీతిరెడ్డిని యాజమాన్యం సస్పెండ్ చేయగా తాజాగా ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఫిర్యాదు ఆధారంగా ప్రాథమిక విచారణ చేపట్టాం. బాత్రూమ్ కిటికీల వద్ద వేలిముద్రలు సేకరించి సాంకేతిక ఆధారాల కోసం అన్వేషిస్తున్నాం. హాస్టల్ సిబ్బంది పై విద్యార్థులు అనుమానం వ్యక్తం చేశారు. సిబ్బంది మొబైల్ ఫోన్లను పరిశీలించి ఎలాంటి రికార్డింగ్‌లు ఉన్నాయో తెలుసుకుంటాం. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం అని ఏసీపీ తెలిపారు.



**ఘటనపై మహిళ కమీషన్ సీరియస్**

మేడ్చల్ కండ్లకొయలోని సిఎంఅర్ బాలికల హాస్టల్ ను రాష్ట్రమహిళా కమిషన్ సందర్శించింది. మహిళా కమిషన్ కార్యదర్శి పద్మజా రమణ ఆధ్వర్యంలో హాస్టల్ విద్యార్థుల స్టేట్ మెంట్ రికార్డు చేశారు. యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే హాస్టల్ లో భద్రత లేకుండా పోయిందని, హాస్టల్ లో బాత్ రూమ్ కు వెళ్ళిన విద్యార్థినిని గుర్తుతెలియని వ్యక్తి వీడియో తీశారని, కండ్లకోయ్య సిఎంఅర్ ఐటి కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు చేపట్టిన ఆందోళనను రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించిందని పద్మజ తెలిపారు. కళాశాల యాజమాన్యంకు నోటీసులు ఇచ్చామని, విద్యార్థులతో మాట్లాడటం జరిగిందని, మహిళా కమిషన్ చైర్ పర్సన్ కు నివేదిక ఇచ్చి వారి ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకుంటామని కమిషన్ కార్యదర్శి పద్మజ తెలిపారు. ఈ విషయంపై స్పందించడానికి కళాశాల యాజమాన్యం నిరాకరించింది.

# శామీర్ పేట్.. మేడ్చల్ వరకు మెట్రో రైలు సేవలు

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన నేతలు

**జయభేరి, జనవరి 2:**

హైదరబాద్ మెట్రో రైలును మేడ్చల్, శామీర్ పేట వరకు పొడగించడంతో శామీర్ పేటలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా తూంకుంట, శామీర్ పేటలో కాంగ్రెస్ నేతలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు నూతన పథకాలు ప్రవేశపెడుతుందని తెలిపారు. నగరానికే తలమానికం అయిన మెట్రో రైలును మేడ్చల్, శామీర్ పేటకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకోవడం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట్ మండల అధ్యక్షులు వైయస్ శంకర్ గౌడ్, యాదవ్, మాజీ ఎంపిటిసి మహేందర్ యాదవ్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అఫ్జల్,అలియాబాద్ మాజీ సర్పంచ్ కంఠం క్రిష్ణా రెడ్డి, శామీర్ పేట్ గ్రామ అధ్యక్షులు ఎం ఆంజనేయులు, బాబా, సుజాత, భీమిడి జైపాల్, సోగాడ బాల్ రాజ్, యాదగిరి, అజీం, ఇమ్రాన్, రాములు, శ్రీకాంత్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## సెక్యూరిటీ గార్డ్ పై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

- సెక్యూరిటికి గాయాలు, ఆస్పత్రికి తరలింపు

**జయభేరి, జనవరి 2:**

సెక్యూరిటీ గార్డుపై గుర్తు తెలియని వ్యక్తులు కర్రలతో దాడి చేశారు. ఈ సంఘటన మేడ్చల్ జిల్లా తూంకుంటలో చోటు చేసుకుంది. తూంకుంట లోని విశ్వవిశ్వాని కళాశాలలో షేక్ షరిక్ (32) అనే వ్యక్తి సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. రోజు వారి మాదిరిగా కళాశాల గేట్ 2 వద్ద అతను విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో ఇద్దరు వ్యక్తులు కారులో వచ్చి కళాశాల గేటు తెరవాలని డిమాండ్ చేశారు. అయితే కళాశాల సమయం ముగియడంతో గేటు తెరవడానికి వీలు ఉండదని సెక్యూరిటీ తేలపడంతో ఆగ్రహానికి గురైన వారు అతనిపై కర్రలతో దాడి చేసి కారు తాళంతో కడుపులో పొడిచి పరారయ్యారు. గాయపడిన సెక్యూరిటీ గార్డును 108 అంబులెన్స్ లో తూంకుంట లోని ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు శామీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## మున్సిపల్ కార్మికులకు స్వెటర్ల పంపిణీ

**జయభేరి, మేడ్చల్ :**

మున్సిపాలిటీ పరిశుభ్రతకు నిరంతరం కృషి చేస్తున్న శానిటేషన్ సిబ్బందికి చలి కాలంలో చలి తీవ్రత దృష్టిలో పెట్టుకొనితగిన జాగ్రత్తలు తీసుకోవడం కోసం ప్రభుత్వం కార్మికులకు స్వెటర్లు, టోపీలు, అప్రన్లు అందిస్తున్నట్లు గుండ్ల పోచంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ మద్దుల లక్ష్మీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం శానిటేషన్ కార్మికులకు ఆమె స్వెటర్లు, టోపీలు, అప్రన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రభాకర్, కమిషనర్ స్వామి నాయక్, కౌన్సిలర్లు అమరం జైపాల్ రెడ్డి, దొడ్ల మల్లికార్జున్, భేరి బాలరాజు, నాయకులు అమరం మోహన్ రెడ్డి, సురేందర్ గౌడ్, జనార్ధన్ రెడ్డి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు బాసటగా గా సిఎంఆర్ఎఫ్



**జయభేరి, గజ్వేల్, జనవరి 02:**

సీఎంఆర్ఎఫ్ పేదలు సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని మల్లన్న సాగర్ ఆర్అండ్ఆర్ కాలనీ పల్లెపహాడ్ గ్రామానికి చెందిన శనిగరం బిక్షపతి తండ్రి యాదయ్య హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. వారికి సీఎం సహాయనిధి నిధుల నుండి మంజూరు చేసిన 21 వేల రూపాయల చెక్కును గురువారం గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎంతోమంది పేద ప్రజలకు సీఎంఆర్ఎఫ్ ఉపయోగపడిందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ టౌన్ ప్రెసిడెంట్ నవాజ్ మీరా, కౌన్సిలర్ బొగ్గుల చందు, కొమ్ము నరేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ ను కలిసిన ములుగు నేతలు



**జయభేరి, ములుగు, జనవరి 02 :**

మాజీ మంత్రి వర్యులు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావును తెలంగాణ భవన్ లో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు ములుగు మండల మాజి జెడ్పిటిసి అర్జున్ గౌడ్, గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇన్చార్జ్ కొమ్ము నవీన్ కుమార్ తెలియజేశారు. అలాగే వారి కొడుకుకు పుట్టిన రోజు దీవెనలు మాజి మంత్రి అందించారు.

## మాజీ ఎంపీటీసీ మృతి బాధాకరం

- భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించిన ఎమ్మెల్సీ,మాజి ఎఫ్డీసీ



**జయభేరి, వర్గల్, జనవరి 02 :**

వర్గల్ మండలం తునికి కాల్వా తాజా మాజీ ఎంపీటీసీ గౌడుగు జనార్ధన్ మృతి చెందారు. విషయం తెలుసుకొని గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు.పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతునితో కోరుకున్నట్లు పేర్కొన్నారు. గౌడుగు జనార్ధన్ తునికి కాల్వా గ్రామానికి చేసిన సేవలను గుర్తు చేశారు.

## వినయ్ భాస్కర్ ను కలిసిన డా.బండి రజనీ కుమార్



**జయభేరి, హన్మకొండ, జనవరి 02:**

గురువారం హన్మకొండ బిఅర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ ను పార్టీ ఆఫీస్ లో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయండం జరిగింది. ఈ కార్యక్రమంలో బండి రజిని కుమార్ తో పాటుగా హాసన్ పర్తి మాజీ సర్పంచ్ బయ్యాగాని శ్రీనివాస్, అల్లా రవీందర్, బిఅర్ఎస్ సీనియర్ నాయకులు పోగుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది

■ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**జయభేరి, హన్మకొండ, జనవరి 02:**

స్వయం సహాయక సంఘాలు ప్రోత్సహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం తగు సహకారం అందించడం జరుగుతుందని పరకాల శాసన సభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం హనుమకొండ కలెక్టర్ సమావేశ మందిరంలో వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టర్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ప్రోత్సహించడం ద్వారా ముఖ్యంగా గ్రామీణ మహిళల ఆర్థిక అభివృద్ధి బలోపేతం చెందడం జరుగుతుందని ఆయన అన్నారు. పరకాల నియోజకవర్గం అభివృద్ధిలో భాగంగా నియోజకవర్గంలో పాలసేకరణ కేంద్రాలను ఏర్పాటు చేయటం, మహిళా సంఘాల ద్వారా ఒక మెగావాట్ సోలార్ విద్యుత్ కేంద్రాలను గుర్తించడం, ప్రతి మండలంలో 350 మంది గుర్తించి వారికి టైలరింగ్ తర్ఫీదు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వీటికి ఉయ్ (ఉమన్ ఇంటర్ పెన్యూర్) హబ్ సహకారం అందిస్తుందని తెలిపారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల ద్వారా చేసిన ఉత్పత్తులు వస్తువులకు దేశీయ, విదేశీ మార్కెట్లో నిక్రయించే విధంగా చర్యలు చేపడితే మంచి ఫలితాలను సాధించవచ్చని ఆయన అన్నారు. ఇదే దిశలో నేడు వారు చేస్తున్న ఉత్పత్తులకు మార్కెట్లో మంచి ప్రోత్సాహం లభిస్తుందని ఆయన తెలిపారు. వారు తయారు చేసిన ఉత్పత్తులను మరింత మెరుగు దిద్దే విధంగా మెరుగైన శిక్షణ ఇచ్చే విధంగా డిఆర్‌డిఏ మెప్మా, పరిశ్రమల శాఖ తగు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. విదేశీ మార్కెట్లో ఉత్పత్తులు విక్రయించడం విక్రయించే విధంగా చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ.. మార్కెట్ డిమాండ్ మేరకు వస్తువులు తయారు చేసే విధంగా వారికి నైపుణ్యాలతో కూడిన శిక్షణ ఇవ్వాలని తద్వారా వారి ఆర్థికంగా ఎదగడానికి దోహదపడగలరని అభిలాషించారు. ఉయ్ హబ్ సీ.ఈ.ఓ సీత మాట్లాడుతూ.. మహిళలను పారిశ్రామికవేత్తలుగా ఉయ్ హబ్ ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. మహిళలు ఇప్పుడు చేస్తున్న వ్యాపారాల అభివృద్ధికి తోడ్పడటం, కొత్త రంగాలలో గుర్తించి వాటికి సంబంధించి తర్ఫీదు ఇచ్చి ప్రోత్సహించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి, డి.ఆర్.ఓ గణేష్, ఆర్.డి.ఓ నారాయణ, హనుమకొండ డి.ఆర్.డి.ఓ శ్రీను, వరంగల్ డి.ఆర్.డి.ఓ కౌసల్యదేవి, తహశీల్దార్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నూతన సంవత్సర శుభాకాంక్షలు

■ ఇరగ దిండ్ల శ్రీశైలం

**జయభేరి, మిర్యాలగూడ :**

మిర్యాలగూడెం శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి (BLR) కు ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన చందంపేట కాంగ్రెస్ నాయకులు ఇరగ దిండ్ల శ్రీశైలం ఇరగదిండ్ల శ్రీశైలం ను ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు ఇతర అంశములపై చర్చించిన బిఎల్ఆర్.

## లక్కీ డ్రా ద్వారా ముగ్గురి మహిళలను ఎంపిక

■ డిపో మేనేజర్ తల్లాడ రమేష్ బాబు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో నడుస్తున్న డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళలను లక్కీ డ్రా ద్వారా ముగ్గురిని ఎంపిక చేసినట్లు డిపో మేనేజర్ తల్లాడ రమేష్ బాబు మంగళవారం తెలిపారు. 1. సుధ, దేవరకొండ. 2. అనసూయ, చెరుకుపల్లి. 3. శోభ, మల్లేపల్లి విజేతలుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. డిపో పరిధిలోని డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళలకు ప్రతి 15 రోజులకు ఒకసారి లక్కీ డ్రా ద్వారా ముగ్గురుని ఎంపిక చేసి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. మహిళా ప్రయాణికులు బస్సుల్లో ఏర్పాటు చేసిన గిఫ్ట్ బాక్స్ ల్లో టికెట్ వెనకాల పేరు ఫోన్ నెంబర్ రాసి వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు, ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

## యువతకు అధ్యక్ష బాధ్యతలు ఇవ్వాలి




**జయభేరి, దేవరకొండ :**

భారతీయ జనతా పార్టీ నూతన పట్టణ అధ్యక్షులు కొరకు క్రియశీలా సభ్యుల నుండి బూత్ అధ్యక్షల నుండి అభిప్రాయ సేకరణ చేయడం జరిగినది కార్యక్రమమును ఉద్దేశించి భవనం మధుసూదన్ రెడ్డి, వానం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలోని యువతను ప్రోత్సహించాలి అనే ఉద్దేశంతో యువత కు అధ్యక్ష బాధ్యతలు ఇవ్వాలని అన్నారు.

## బద్దెల అంజయ్యకు ఆర్థిక సహాయం

■ బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్



**జయభేరి, నేరేడుగొమ్ము :**

నేరేడు గొమ్ము మండలంలోని కాచారాజుపల్లి గ్రామానికి చెందిన బద్దెల అంజయ్య కొన్ని నెలల క్రితం పశువుల కాపలా గా వెళ్తున్న క్రమంలో అమ్రాబాద్ అడవులలో జంతువులూ దాడి చెయ్యడంతో బద్దెల అంజయ్యకి తీవ్ర గాయాలు కావడంతో అంజయ్య నేడు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ ని ఆశ్రయించడంతో అంజయ్య కంటి ఆపరేషన్ నిమిత్తం అంజయ్య కు 30,000/ వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. బద్దెల అంజయ్య మాట్లాడుతూ.. నాకు సహాయం చేసినందుకు నేనావత్ కిషన్ నాయక్ కు ఎంతో రుణపడి ఉంటానని తెలియజేసినారు. కిషన్ నాయక్ ను అడిగిన వెంటనే సహాయం చేసినడని ఏ కార్యకర్తకు సహాయం అడిగిన ప్రతి ఒక్కరికి సహాయం చేస్తాడని తెలియజేసినాడు.

## స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన
# తొలితరం మహిళా

**సావిత్రిబాయి ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు. స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి.. స్త్రీల విముక్తి కోసం అహర్నిశలు శ్రమించిన నాయకి, గొప్ప రచయిత్రి. స్త్రీపురుషులు కులమతాలకతీతంగా విద్యనభ్యసించడం సహజమైన హక్కు ఉంటుందని, అందుకే అందరూ చదవాలి అందరూ సమానంగా బ్రతకాలి అని అనునిత్యం తపించిన సామాజిక విప్లవ మాతృమూర్తి సావిత్రిబాయి. నాటి, నేటి సమాజంలో సావిత్రిబాయి ప్రాముఖ్యత గొప్పది.**

**జయభేరి, హైదరాబాద్ :**



సావిత్రీబాయి పూలే 19వ శతాబ్దపు భారతదేశంలో మహిళల హక్కులు మరియు విద్యను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించిన సంఘ సంస్కర్త, విద్యావేత్త, కవయిత్రి. దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా, బాలికలకు, అణగారిన వర్గాలకు విద్యావకాశాలు కల్పించేందుకు అడ్డంకులు ఛేదించి అవిశ్రాంతంగా కృషి చేశారు. ఆమె భర్త జ్యోతిరావు పూలేతో కలిసి సావిత్రీబాయి భారతదేశంలో సామాజిక సమానత్వం యొక్క కొత్త శకానికి నాంది పలికేందుకు అణచివేత కుల, లింగ నిబంధనలను సవాలు చేసింది. జ్యోతిరావ్ పూలే మరియు సావిత్రీబాయి పూలే సామాజికంగా అణగారిన వర్గాల పరిస్థితులలో మార్పులు తీసుకురావడానికి విద్యను ఒక సాధనంగా భావించారు. విద్యను ప్రోత్సహించడం వెనుక ఉన్న ఆలోచన ఏమిటంటే, నిమ్న కులాల ప్రజలు మరియు మహిళలు దానిని తీసుకునేంత సామర్థ్యం లేరు అనే ఆలోచనను తొలగించడం. అసమానత యొక్క సామాజిక విపత్తుతో పోరాడటానికి విద్య యొక్క ప్రాముఖ్యతను గుర్తించిన మొదటి సంఘ సంస్కర్తలుగా వీరిద్దరూ గౌరవించబడ్డారు. సావిత్రీబాయి పూలే సామాజిక పరివర్తనను ప్రోత్సహించడానికి మహిళల విద్యకు ప్రాధాన్యత ఇచ్చారు.

బ్రిటీష్ పాలనలో భారతదేశంలో మహిళల హక్కుల కోసం పోరాడడంలో సావిత్రీబాయి పూలే ముఖ్యమైన పాత్ర పోషించారు. "మొదటి తరం ఆధునిక భారతీయ స్త్రీవాదులలో ఒకరు" అని వర్ణించబడ్డారు. సావిత్రిబాయి జ్యోతిరావు పూలే ఒక సంఘ సంస్కర్త, కవయిత్రి. సావిత్రీబాయి పూలే తన భర్త జ్యోతిరావ్ పూలే మార్గదర్శకత్వం, మద్దతుతో విద్యారంగంలో ప్రయాణం ప్రారంభించింది. ఆమె చురుకైన తెలివితేటలు మరియు సామర్థ్యాన్ని గుర్తించిన జ్యోతిరావు, అతని స్నేహితులు ఆమె ఇంటి వద్ద విద్యాభ్యాసం చేయించారు. సావిత్రీబాయి జ్ఞాన దాహం, నేర్చుకోవాలనే ఆమె సంకల్పం ఆమెను అధికారిక విద్యను పొందిన మొదటి భారతీయ మహిళల్లో ఒకరిగా చేసింది. ఈ విద్య ఆమెకు సాధికారతను అందించడమే కాకుండా, బోధన, సంఘ సంస్కరణల పట్ల ఆమెకున్న అభిరుచిని రేకెత్తించింది, చివరికి భారతదేశంలో బాలికల కోసం మొదటి పాఠశాలను స్థాపించడానికి దారితీసింది. సావిత్రీబాయి విద్యారంగంలో తన పనితో పాటు వివిధ సామాజిక సంస్కరణల్లో చురుకుగా పాల్గొంది. ఆమె బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడింది, వితంతు పునర్వివాహానికి మద్దతు ఇచ్చింది, వితంతువులు, గర్భిణీ అత్యాచార బాధితులకు ఆశ్రయం కల్పించింది. ఆమె ప్రయత్నాలు సామాజిక నిబంధనలను సవాలు చేయడంలో, భారతదేశంలోని మహిళలు, అణగారిన సమూహాల స్థితిని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించాయి.

సావిత్రీబాయి పూలే కెరీర్ విద్య, సామాజిక న్యాయం పట్ల ఆమెకున్న తిరుగులేని నిబద్ధతతో గుర్తించబడింది, ఆమె భారతదేశ చరిత్రలో అగ్రగామిగా నిలిచింది. సావిత్రీబాయి పూలే



**వ్యాసకర్త: ఆలేటి రమేష్**
**99487 98982**

సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా చేసిన పోరాటం ఆమె జీవితపు పనికి మూలస్తంభం, ఆమె కాలంలోని కొన్ని ముఖ్యమైన సమస్యలను పరిష్కరించింది. ఆమె బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సతి (వితంతువు దహనం) ఆచారానికి వ్యతిరేకంగా తీవ్రంగా ప్రచారం చేసింది, ఈ రెండూ సమాజంలో లోతుగా పాతుకుపోయాయి. వితంతువుల పునర్వివాహం కోసం వాదించడం. ఈ పద్ధతులను వ్యతిరేకించడం ద్వారా, ఆమె మహిళల హక్కులు, గౌరవాన్ని కాపాడాలని కోరింది. ఆమె ప్రయత్నాలలో గణనీయమైన భాగం అణగారిన కులాలను, ప్రత్యేకించి తీవ్ర వివక్ష, అణచివేతను ఎదుర్కొన్న దళితులను ఉద్ధరించడంపై దృష్టి సారించింది. సావిత్రీబాయి తన భర్త జ్యోతిరావు పూలేతో కలిసి ఈ అట్టడుగు వర్గాలకు విద్యావకాశాలు కల్పించడానికి అవిశ్రాంతంగా కృషి చేసింది, విద్య సామాజిక మార్పుకు శక్తివంతమైన సాధనం అని నమ్మింది.

సావిత్రీబాయి, జ్యోతిరావ్ పూలే సత్యశోధక్ సమాజ్ (సత్యాన్ని కోరేవారి సంఘం)ను స్థాపించారు, ఇది సామాజిక సంస్కరణకు అంకితం చేయబడింది. సమాజం సమానత్వాన్ని ప్రోత్సహించడం, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడడం, అణగారిన సమూహాల హక్కులను సమర్థించడం, మరింత న్యాయమైన, సమానమైన సమాజం కోసం వాదించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఆమె చివరి రోజుల్లో, పూణేలో ప్లేగు మహమ్మారి బారిన పడిన ప్రజలకు ఆమె చురుకుగా సహాయం చేసింది. ప్రమాదాలు ఉన్నప్పటికీ, ఆమె, ఆమె కుమారుడు యశ్వంత్ అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆదుకోవడానికి అవిశ్రాంతంగా శ్రమించారు. దురదృష్టవశాత్తు, ఇతరులకు సేవ చేస్తున్నప్పుడు ఆమె స్వయంగా ప్లేగు బారిన పడింది, అనారోగ్యంతో మరణించింది. సావిత్రీబాయి మరణం ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడం, సామాజిక న్యాయం కోసం పోరాడడం కోసం ఆమె జీవితకాల అంకితభావానికి నిదర్శనం. ఆమె నిస్వార్థ చర్యలు, రచనలు గుర్తుంచుకోవడం, జరుపుకోవడం కొనసాగుతుంది.

సావిత్రీబాయి పూలే విద్య, మహిళల హక్కులలో మార్గదర్శక ప్రయత్నాలు భారతదేశంలో స్త్రీవాద ఉద్యమానికి పునాది వేసింది. ఆమె ధైర్యం, దృఢ సంకల్పం, తీవ్రమైన ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్న కరుణ దేశవ్యాప్తంగా ప్రజలను కుల, లింగ వివక్షకు వ్యతిరేకంగా పోరాడటానికి ప్రేరేపించడం కొనసాగుతుంది. మేము ఆమె వారసత్వాన్ని జరుపుకుంటున్నప్పుడు, సమానత్వం మరియు న్యాయం కోసం యుద్ధం ముగిసిందని గుర్తుంచుకోవడం ముఖ్యం. కుల, తరగతి లేదా లింగ భేదం లేకుండా ప్రతి వ్యక్తికి విద్య, అవకాశాలు అందుబాటులో ఉండే సమగ్ర సమాజం కోసం సావిత్రీబాయి దృష్టిని ముందుకు తీసుకెళ్లడం మన చేతుల్లో ఉంది.



## వైకుంఠ ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు

■ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి
■ భక్తుల భద్రతకు పెద్ద పీట - ఎస్పీ సుబ్బరాయుడు
■ వాహనాల పార్కింగ్ కు ప్రత్యేక ఏర్పాట్లు

**జయభేరి, తిరుమల, జనవరి 02 :**

తిరుమలలో జనవరి 10 నుండి 19వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి చెప్పారు. తిరుమలలోని పలు ప్రాంతాలను అదనపు ఈవో, జెఈవో వీరబ్రహ్మం, జిల్లా ఎస్పీ సుబ్బ రాయుడు, సివిఎస్వో శ్రీధర్తో కలిసి పరిశీలించారు. తరువాత అదనపు ఈవో మీడియాతో మాట్లాడుతూ, వైకుంఠ ద్వారా దర్శనానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా టీటీడీ అధికారులు, విజిలెన్స్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. జనవరి 10, 11, 12వ తేదీలలో అధిక సంఖ్యలో భక్తులు వస్తారు కావున ఇందుకోసం అధికారులతో చర్చించి పూర్తి స్థాయిలో ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. దర్శనానికి విచ్చేసే విఐపిలకు వారికి అందించే పాసులలోనే దర్శన సమయం, పార్కింగ్ ప్రాంతం, ప్రవేశ, నిష్క్రమణ గేట్ల వివరాలు పొందిపరిచనున్నట్లు తెలిపారు. రాంబగిచా ప్రాంతంలో వాహన పార్కింగ్ ను ఈ రోజులలో బైటకు బదిలాయించినట్లు చెప్పారు. దీనికి బదులుగా 10 బగ్గీలు, అదనపు సిబ్బంది, సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. విఐపిలు, భక్తులు తమకు కేటాయించిన సమయం ప్రకారం మాత్రమే దర్శనానికి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా భక్తులు తమ పాదరక్షలను గదులలో, వారి వాహనాలలో వదలి రావాలన్నారు. అధిక రద్దీ నేపథ్యంలో తోటి భక్తులకు ఇబ్బంది లేకుండా పారిశుద్ధ్యాని పాటించాలని, వ్యర్థాలను టీటీడీ ఏర్పాటు చేసిన డస్ట్ బిన్లలోనే వేయాలని అదనపు ఈవో కోరారు. భక్తులకు సూచించిన నిబంధనలు పాటిస్తూ టీటీడీకి సహకరించాలన్నారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ, తిరుమల, తిరుపతిలలో వైకుంఠ ఏకాదశికి విచ్చేసే భక్తులకు భద్రతా పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. తిరుమలలో ట్రాఫిక్ను సక్రమంగా నిర్వహించడం, తిరుపతిలోని ఎస్ఎస్డి కౌంటర్ల వద్ద, ఫుట్పాత్ మార్గంలో కూడా బందోబస్తు ఏర్పాటు చేయడంపై సుదీర్ఘంగా చర్చించినట్లు వివరించారు. అదనపు ఈవో, జిల్లా ఎస్పీతో కలిసి పరకామణి భవనం ప్రక్కన ఉన్న ఖాళీ ప్రాంతం, శ్రీవారి సేవాసదన్ ముందు, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ బృందావనం సమీపంలో ఉన్న పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. తరువాత ఏటిసి వద్ద క్యూలైన్లు, ప్రవేశ మార్గాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవో లోకనాథం, విజివో సురేంద్ర, ఇతర అధికారులు, పోలీస్, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

# సివిల్ సప్లై హమాలీల రేట్లు ఒప్పందం తక్షణమే అమలు చేయాలి

- బొట్ల చక్రపాణి సిఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు

**జయభేరి, హన్మకొండ, జనవరి 02:**



సివిల్ సప్లై హమాలీల ఎగుమతి దిగుమతి రేట్ల ఒప్పందం ప్రకారం జీవో విడుదల చేసి పెరిగిన రేట్లు 2024 జనవరి నుంచి సంవత్సరకాలం ఏరియర్స్ చెల్లించాలని సివిల్ సప్లై కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్నారు కాబట్టి ప్రభుత్వం తక్షణమే మీరు డిమాండ్లను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అల్ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం అంబేద్కర్ భవనం పక్కన ఉన్న సివిల్ సప్లై గోదాం వద్ద కార్మికుల సమ్మె ను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. హమాలీల వేతన ఒప్పంద్దాన్ని వెంటనే అమలు చేయకపోవడం తో 2025 జనవరి 1నుండి రాష్ట్రవ్యాప్తంగా సివిల్ సప్లై, జిసిసి హమాలీల కార్మికుల ఎగుమతి దిగుమతి రేట్ల ఒప్పందం 2023 డిసెంబర్ తో ముగిసింది 2024, 2025 నూతన రేట్ల ఒప్పందాన్ని కోసం హమాలీ కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో ప్రభుత్వానికి అనేక దఫాలుగా విన్నవించిన నేపథ్యంలో నూతన రేట్లు, ఇతర సమస్యల పరిష్కారానికి 10 నెలల తర్వాత 03102024 న అన్ని కార్మిక సంఘాల సమక్షంలో చర్చలు జరిపి ఎగుమతి దిగుమతి నూతన రేట్లు ప్రస్తుతం ఉన్న 26/నుండి 29 రూపాలుగా అనగా 3/రూపాయలు పెంచారు. ఈ పెరిగిన రేట్లు 2024 జనవరి నుండి అమలు చేస్తామని ఏరియాస్ తో సహా చెల్లిస్తామని, మహిళా కార్మికులకు గోధుమల సామర్థ్యాన్ని బట్టి ప్రస్తుతం ఇస్తున్నా వేతనం పైన 1000/అదనంగా పెంచుతామని, బోనస్ 6,500 నుండి 7500కు, యూనిఫామ్ స్టిచ్చింగ్ చార్జి 1300 నుండి 1600 వరకు, దసరా పండుగ సందర్భంగా ఇచ్చే స్వీట్ బాక్స్ కి 800నుండి 900వరకు సివిల్ సప్లై హమాలీల వలె జెసిసి హమాలీలకు పిఎఫ్ సౌకర్యం కల్పిస్తామని ఇతర సమస్యల పరిష్కరిస్తామని కమిషనర్ సంబంధిత అధికారులు అంగీకరించడం జరిగింది. పై హామీలన్నీ వారం రోజుల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చిన సివిల్ సప్లై అధికారులు మూడు నెలలు గడిచిన ఒప్పందం ప్రకారం నేటికీ కనీసం జీవో విడుదల చేయలేదు. గత ఒప్పందాల సందర్భంలో చర్చలు జరిగిన తర్వాత జీవో విడుదల చేసి వెంటనే పెరిగిన రేట్ల ప్రకారం ఏరియర్స్ అందించడం జరిగేది. కానీ గత ఒప్పందాలకు భిన్నంగా సంవత్సరం కాలం గడిచిన నేటికి హమాలీల సమస్యల పైన రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం హమాలీలను ఆర్థికపరంగా నష్టపరచడమే తప్ప మరొకటి కాదు అని ఆయన అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా తక్షణమే ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేనియెడల ఈ సమయంలో మరింత ఉధృతం చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హమాలీ మేస్త్రి కుక్కల మల్లయ్య రాజబోయిన కోటి ఆకుల సుధాకర్ కన్నబోయిన కుమార్ బోయిని కట్టయ్య కొలుపుల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



## బెంగళూరు డ్రగ్స్ కేసులో నటి హేమకు ఊరట

**జయభేరి, హైదరాబాద్:**

బెంగలూరు డ్రగ్స్ కేసులో నటి హేమకు ఊరట లభించింది. హేమపై నమోదైన కేసులో బెంగళూరు హైకోర్టు స్టే విధించింది. గతేడాది బెంగళూరులో హేమపై రేవ్ పార్టీ కేసు నమోదయిన విషయం తెలిసిందే. తనపై నమోదైన డ్రగ్స్ కేసు కొట్టివేయాలని హేమ పిటిషన్ దాఖలు చేసారు. ఈ కేసులో బెంగళూరు పోలీసులు ఇప్పటికే ఛార్జ్షీట్ దాఖలుచేసారు. తాజాగా హేమ పిటిషన్ ను విచారించిన కోర్టు కేసులో స్టే విధించింది.

## పేదలతో ఆటలాడుతున్న జీహెచ్ఎంసి




**జయభేరి, హైదరాబాద్:**

జిహెచ్ఎంసి అధికారులు పేదవారి ఆశలతో ఆడుకుంటున్నారని జియాగూడ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేసారు. జిహెచ్ఎంసి అధికారులు స్థానికులకు కొందరికి ఫోన్ చేసి మీకు డబల్ బెడ్ రూమ్ ఫ్లాట్లు అలర్ట్ అయ్యాయని వాటికి సంబంధించి డబల్ బెడ్ రూమ్ వద్ద ఉన్న వార్డ్ ఆఫీస్ కి రావాలని కోరారు, దీంతో ఫోన్ చేసిన వారందరూ వాట్ ఆఫీస్ వద్దకు వచ్చి ఉదయం నుండి సాయంత్రం వరకు పడిగాపులు కాసి గత వారం రోజులుగా ఇదే జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ చేసి రమ్మని చెప్పి తీరా వారు వచ్చేసరికి ఆఫీసులకు తలుపులు పెట్టి వారి సొంత పనులపై వెళ్తున్నట్లు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకరోజు రెండు రోజులు కాదు ఇలా వారం రోజులు పాటుగా వర్డ్ ఆఫీస్ కి చెక్కర్లు కొడుతున్నామని ఇప్పటికైనా సంబంధిత అధికారులు వాడు ఆఫీస్ వారిపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

## ఉద్యాన ఉత్సవ్ కు పెద్దపల్లి జిల్లా రైతులు

**జయభేరి, ములుగు, జనవరి 02 :**



రాష్ట్రపతి నిలయము బొల్లారంలో నిర్వహిస్తున్న "ఫ్లవర్ అండ్ హార్టికల్చరల్ ఫెస్టివల్" (ఉద్యాన ఉత్సవ్) కార్యక్రమానికి శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం క్రింద పనిచేస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం, పెద్దపల్లి జిల్లా నుండి వివిధ గ్రామాలకు చెందిన 50 మంది రైతులను పంపిస్తుంది. ఈ కార్యక్రమంలో ఉద్యాన విశ్వవిద్యాలయం గౌరవ ఉపకులపతి డాక్టర్ దండ రాజిరెడ్డి జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పెద్దపల్లి జిల్లా రైతులతో వివిధ పంటల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరి, పత్తి, మొక్కజొన్నతో పాటు ఉద్యాన పంటలు పండించాలని వారు సూచించారు. జిల్లాలోని కొన్ని గ్రామాలను ఎంచుకొని ఆ గ్రామంలో కూరగాయలు పండించే విధంగా "మన ఊరు మన కూరగాయలు" కార్యక్రమాన్ని చేపట్టవలసిందిగా రైతులకు సూచించారు.ఆ గ్రామంలోని పండిన కూరగాయలు ఆ గ్రామ జనాభా కి సరిపడిన తర్వాతనే వేరే గ్రామాలకు, పట్టణాలకు అమ్ముకోవాలని సూచించారు. రానున్న ఆరు నెలల కాలంలో ఈ కార్యక్రమాన్ని కొన్ని గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలని కృషి విజ్ఞాన కేంద్రము, రామగిరి ఖిల్లా ఈ విషయంలో ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్.డి.విజయ కృషి విజ్ఞాన కేంద్రం, ప్రోగ్రాం కోఆర్డినేటర్ అండ్ హెడ్ డాక్టర్.ఎ. శ్రీనివాస్, ఉద్యాన శాస్త్రవేత్త బి. భాస్కరరావు, విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్.టి. వినోద్ కుమార్, పెద్దపల్లి జిల్లా నుండి 50 మంది రైతులు పాల్గొన్నారు.

# రేవంత్ ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు



- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

**జయభేరి, హైదరాబాద్:**

బీఆర్ ఎపస్ ఎమ్మెల్యేలు కె .పి .వివేకానంద, మర్రి రాజశేఖర్ రెడ్డి ,మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ గురువారం నాడు తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే కె.పి .వివేకానంద మాట్లాడుతూ .మెట్రో ప్రాజెక్టును శామీర్ పేట ,మేడ్చల్ వరకు విస్తరిస్తామని నిన్న సీఎం రేవంత్ రెడ్డి ఓ ప్రకటన చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్ ప్రభుత్వం మెట్రో మూడో దశ విస్తరణకు సంబంధించి నిర్ణయం తీసుకుంది. కన్సల్టెంట్ ను కూడా కేసీఆర్ ప్రభుత్వం నియమించింది. రేవంత్ రెడ్డి అధికారం లోకి వచ్చి రాగానే కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయాలని మెట్రో విస్తరణ ప్రాజెక్టు ను రద్దు చేశారు. ఏడాది గా రేవంత్ నిర్ణయాలన్నీ తిరోగమన చర్యలే నని అన్నారు. తెలంగాణ అభివృద్ధి ని కుంటుపడేలా చేశారు. ఏడాది గా మెట్రో పై కాలయాపన చేసి నిన్న కేసీఆర్ ప్రభుత్వం లో తీసుకున్న నిర్ణయాన్నే ప్రకటించారు. హైదరాబాద్ ను వరల్డ్ క్లాస్ సిటీ గా మార్చేందుకు కే టీ ఆర్ రోడ్ మ్యాప్ ను తయారు చేశారు. ఏడాదిగా కేసీఆర్ హయం లో తీసుకున్న నిర్ణయాలు అమలు చేసి ఉంటె తెలంగాణ పురోగమన దిశలో ఉండేది. అన్ని వ్యవస్థలను రేవంత్ ధ్వంసం చేశారు. కేవలం తన అహం తో రేవంత్ కేసీఆర్ చేపట్టిన ప్రాజెక్టు లను ఆపారు. నిన్న కాంగ్రెస్ నేతలతో తాను మారిన మనిషిని రేవంత్ చెప్పినట్టు వార్తలు వచ్చాయి. అంటే ఏడాది కాలం లో తన చర్యలు తప్పు అని రేవంత్ ఒప్పుకుంటున్నారు. కేసీఆర్ తెలంగాణ అభివృద్ధి కి వేసుకున్న రోడ్ మ్యాప్ ను రేవంత్ అమలు చేయక తప్పదు. మెట్రో తాజా ప్రతిపాదనలు బీ ఆర్ ఎస్ సాధించిన విజయమని అన్నారు. .హైదరాబాద్ ఉత్తరం లో మెట్రో ప్రాజెక్టును విస్తరించాలని ప్రజలు చేసిన ఉద్యమానికి సీఎం మెడలు వంచక తప్పలేదు. .రాయదుర్గ్ నుంచి శంషాబాద్ వరకు మెట్రో విస్తరణకు కూడా రేవంత్ పూనుకోవాలి . పది లక్షల మంది ఐటీ ఉద్యోగులున్న ప్రాంతం లో మెట్రో విస్తరణ గురించి ఎందుకు ఆలోచించరు ? జే బీ ఎస్ నుంచి శామీర్ పేట వరకు ఎలివేటెడ్ కారిడార్ కు సీఎం రేవంత్ శంఖు స్థాపన చేసినా ఇప్పటి వరకు తట్టెడు మట్టి తీయలేదు . శామీర్ పేట ,మేడ్చల్ వరకు మెట్రో విస్తరణ పనులు ఎప్పటి వరకు పూర్తి చేస్తారో చెప్పాలి. కేంద్రం నుంచి సాయం వస్తేనే పనులు చేపడతామని అనడం సరికాదు. .కేసీఆర్ హాయం లో పెద్ద ప్రాజెక్టులెన్నో రాష్ట్ర సొంత నిధులతో పూర్తి అయ్యాయి. హైదరాబాద్ ఉత్తరాది మెట్రో పనులను ద్వితీయ ప్రాధాన్యత లో చేర్చడం సరికాదు.వెంటనే మొదటి ప్రాధాన్యత లో చేర్చాలి. మెట్రో ,ఫార్మా ,హైడ్రా ,హైదరాబాద్ కు తాగునీరు వంటి అంశాల్లో సీఎం రేవంత్ తిరోగమన చర్యలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రేవంత్ ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు.

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... మేడ్చల్ ,శామీర్ పేటలకు మెట్రో రైలు ప్రాజెక్టు అనేది కేసీఆర్ హాయం లో తీసుకున్న నిర్ణయం. వెంటనే ప్రథమ ప్రాధాన్యత క్రమం లో ఈ ప్రాజెక్టు పనులు మొదలు పెట్టాలని అన్నారు.

మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మాట్లాడుతూ కొత్త సంవత్సరం లోనైనా సీఎం రేవంత్ రెడ్డి తిరోగమన చర్యలు ఆపాలి. ఏడాది లో రేవంత్ తుగ్లక్ నిర్ణయాలెన్నో తీసుకున్నారు. ఎన్నికలప్పుడు కాంగ్రెస్ వివిధ వర్గాలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదు. 400 రోజుల్లో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారు. అరాచక పాలన రాష్ట్రం లో నడుస్తోంది. కేసీఆర్ హాయం లో తీసుకున్న నిర్ణయాలను మొదట్లో రేవంత్ రద్దు చేసి ఏడాది తర్వాత మళ్ళీ వాటినే అమలు చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ,పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుల పై కూడా రేవంత్ వైఖరి ఒకేలా లేదు. జేబీఎస్ నుంచి తూము కుంట, పారడైస్ నుంచి కండ్ల కోయ వరకు మెట్రో విస్తరణ పనులు కేసీఆర్ హయం లో ప్రతిపాదించినవే ..కొన్ని కిలోమీటర్ల వరకు మార్గాన్ని పొడగించి రేవంత్ గొప్పలు చెప్పుకుంటున్నారు . డాది లో లక్షా 37 వేల కోట్ల అప్పు చేసి ఒక్క పెద్ద ప్రాజెక్టునైనా కట్టారా ? ఒక్క కొత్త సంక్షేమ పథకమైనా తెచ్చారా ? ఏడాది లో గురుకులాల్లో 56 మంది విద్యార్థులు మరణించారు. లగ చర్ల లో లంబాడాలపై ,అశోక్ నగర్ లో నిరుద్యోగుల పై లాఠీలు విరగడం తప్ప రేవంత్ ప్రభుత్వం ఏమీ సాధించింది. రేవంత్ సంపాదనలో రవ్వంత కాదు కొండంత గా మారారని అన్నారు. రేవంత్ కు సొంత సంపాదన పై ఉన్న శ్రద్ధ ప్రజల పైన లేదు. తెలంగాణ కు కేసీఆర్ లక్షల కోట్ల సంపాదనను సృష్టించారు. రేవంత్ హయం లో భూ సంపద కూడా ఆవిరై పోయిందని అన్నారు.



## బీఆర్ఎస్ కార్యకర్తలకు బీమా ధీమా

- ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం
- బిఆర్ఎస్ పార్టీలో సభ్యత్వం పొంది మృతి చెందిన కార్యకర్త కుటుంబానికి రూ.2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అందించిన మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

**జయభేరి, చింతపల్లి :**

బీ ఆర్ ఎస్ పార్టీ తమ కార్యకర్తలకు అండగా ఉంటుందని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ భరోసా ఇచ్చారు. చింతపల్లి మండలం ధైర్యపురి తండాకు రమావత్ కేశవులు చెందిన బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలక సభ్యత్వాన్ని పొందారు. రమావత్ కేశవులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. రమావత్ కేశవులు బీఆర్ఎస్ లో సభ్యత్వాన్ని పొందిన వీరయ్య కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ బాసటగా నిలిచింది.గురువారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి అందిన రూ.2 లక్షల బీమా చెక్కును నామినీ లక్ష్మీకు మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ ధైర్యపురి తండాలో ఇంటి వద్దకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అని ఆయన అన్నారు. ఉద్యమ పార్టీ నుంచి ప్రస్థానం ప్రారంభించి రాజకీయ పార్టీగా మారిన బీఆర్ఎస్ పార్టీ తమ కార్యకర్తలందరికీ అండగా నిలుస్తుందని వారు భరోసా ఇచ్చారు. కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్టం అభివృద్ధి పథంలో పయనించిందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో రూ.100 చెల్లించి క్రియాశీలక సభ్యత్వం పొందిన కార్యకర్తలెవరైనా ప్రమాదవశాత్తు మృతి చెందినట్లైతే నామినికీ రూ.2 లక్షల బీమా చెక్కును బీఆర్ఎస్ పార్టీ అందజేస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు దండేటికార్ ప్రసాద్, ఉజ్జయిని రఘురాం రావు,కుంభం శ్రీశైలం, యాదయ్య, గండేటి వెంకటయ్య,రమావత్ బిచ్య నాయక్,మాజీ సర్పంచ్ వాంకుడావత్ బాల్ సింగ్, వాంకుడావత్ చందర్ నాయక్, వాంకుడావత్ బిచ్యనాయక్, రమావత్ బిచ్య నాయక్, రమావత్ నాయక్ రాములు, సిమర్ల శ్రీను యాదవ్, ధైర్యపురి తండ గ్రామ శాఖ అధ్యక్షులు మెగావత్ కళ్యాణ్ నాయక్, యస్.కే మహ్మద్, సభావత్ రమేష్, రమావత్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యనేతల కార్యకర్తలతో మంత్రి పొన్నం సమావేశం



**జయభేరి, సైదాపూర్ :**

సైదాపూర్ మండల్ కాంగ్రెస్ కార్యకర్తలకు ముందుగా మంత్రి పొన్నం ప్రభాకర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మండల అధ్యక్షులు దొంత సుధాకర్ 26 గ్రామాల అధ్యక్షులు ముఖ్య నేతలు మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కారానికి అధికారులతో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో నేతలంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఎన్నికలలో పోటీ చేయాలనుకునే వారు నిత్యం ప్రజలలో ఉండాలని.. ఇప్పటికే ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేసింది, రైతు భరోసా సంక్రాంతికి ప్రారంభం అవుతుందని.. దాని విధి విధానాలు సబ్ కమిటీ ఫైనల్ చేస్తుందని సూచించారు. బోనస్ ఇచ్చాం, ఆర్టీసీ ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును ఇచ్చాం, 500 కి గ్యాస్ అందిస్తున్నాం, ఇప్పటికే 55 వేల ఉద్యోగాలు భర్తీ చేసాం, అన్ని గురుకులాల పాఠశాలలో డైట్ చార్జీలు పెంచాం, త్వరలోనే కొత్త రేషన్ కార్డులు వస్తున్నాయి, ఇందిరమ్మ ఇల్లు సర్వే జరుగుతుంది. ప్రభుత్వం పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు మంత్రి పొన్నం ప్రభాకర్.

## ఈ నెల నాలుగునుంచి ఇంద్రజాల్ మెగా మ్యాజిక్ షో




**జయభేరి, సికింద్రాబాద్:**

ప్రపంచ ప్రఖ్యాత మెజిషియన్ పి సి సర్కార్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ హరిహర కళాభవన్ లో ఇంద్రజాల్ మెగా మ్యాజిక్ షోను నిర్వహించనున్నట్లు తెలిపారు. జనవరి 4న మెగా మ్యాజిక్ షోను హరిహర కళాభవన్ వేదికగా ప్రారంభించనున్నట్లు ప్రముఖ మెజీషియన్ పోరుష్ పేర్కొన్నారు. జనవరి 4 నుండి 19 వరకు శని ఆదివారాలలో సాయంత్రం నాలుగు గంటల నుండి ఏడు గంటల వరకు ప్రదర్శనలు జరగనున్నట్లు వెల్లడించారు. పీవీ సర్కార్ గొప్ప కళ్ళతో అంతర్జాతీయ స్థాయిలో మెజీషియన్ గా కీర్తి ప్రతిష్టలు పొందారని ఆయన బాటలోనే తాను కూడా నడుస్తున్నట్లు పొరుష్ తెలిపారు. నూతన వైవిధ్యభరితమైన మ్యాజిక్ షోలతో ప్రజలను ఆకట్టుకోవడమే లక్ష్యంగా పీవీ సర్కారు కుటుంబం వినోదాన్ని పంచుతున్నట్లు తెలిపారు. పోరుష్ చిన్న వయసులోనే సరికొత్త మ్యాజిక్ షోలతో ప్రజలకు చేరువయ్యారని అన్నారు.




# ఆ సినిమాతో నా జీవితం మారింది

ప్రపంచ మానవాళి అంతా.. గత ఏడాదికి వీడ్కోలు పలికి, కొత్త ఏడాదికి స్వాగతం పలికేశారు. గత జ్ఞాపకాలను మనసులోనే దాచుకొని, కొత్త ఏడాది ఇచ్చే అనుభూతుల కోసం ఎదురుచూస్తున్నారు. ఇటీవల రష్మిక పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో ఇన్నాళ్ల జీవితంలో మీకు గర్తుండిపోయిన మధుర జ్ఞాపకం ఏంటి? అనే ప్రశ్న రష్మికకు ఎదురైంది. దానికి ఆమె సమాధానమిస్తూ.. '2016 డిసెంబర్ 30.. ఆ రోజును నా జీవితంలో మరిచిపోలేను. ఎందుకంటే.. నా తొలి సినిమా 'కిరాక్ పార్టీ' విడుదలైంది ఆ రోజే. ఆ సినిమాతో నా జీవితమే మారిపోయింది. ఆ సినిమాతో కన్నడలో బిజీ అయ్యాను. నా టాలీవుడ్ డెబ్యూ 'చలో' సినిమా ఛాన్స్ నాకొచ్చిందంటే.. కారణం 'కిరాక్ పార్టీనే'. ఆ సినిమా చూసే 'చలో'లో నన్ను తీసుకున్నారు. ఆ తర్వాత నా కెరీర్ సమూలంగా మారిపోయింది. ఇప్పుడంతా నన్ను నేషనల్ క్రష్ అంటున్నారంటే.. దాని వెనుక 'కిరాక్ పార్టీ' సినిమానే ఉంది. అందుకే.. ఆ సినిమా విడుదల డేట్ నాకు ప్రత్యేకం.' అంటూ గుర్తుచేసుకున్నది అందాల రష్మిక.





# బాలీవుడ్ ఇండస్ట్రీలోకి కిస్సిక్ భామ..

అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 సినిమా బాక్సాఫీస్ వద్ద సత్తా చాటింది. ఈ సినిమాలో కిస్సిక్ అంటూ స్పెషల్ సాంగ్ అదరగొట్టేసింది హీరోయిన్ శ్రీలీల. దీంతో అటు నార్త్ ఇండస్ట్రీలో ఈ అమ్మడు పేరు ఓ రేంజ్ లో చక్కర్లు కొడుతుంది. అలాగే శ్రీలీల బాలీవుడ్ అరంగేట్రం చేయవచ్చని వార్తలు వస్తున్నాయి. ప్రముఖ ఫిల్మ్ మేకర్ కరణ్ జోహార్ తన రాబోయే సినిమా 'తు మేరీ మైన్ తేరా, మేన్ తేరా తు మేరీ'తో శ్రీలీలకి పెద్ద బ్రేక్ ఇచ్చే ఛాన్స్ ఉందని సమాచారం. ఇండియా టుడే నివేదిక ప్రకారం, ధర్మ ప్రొడక్షన్ బ్యానర్ పై రాబోయే చిత్రంలో శ్రీలీల నటించనుందని టాక్. ఈ మూవీతోనే ఆమె బాలీవుడ్ ఇండస్ట్రీలోకి అరంగేట్రం చేయనుందని అంటున్నారు. ఇందులో కార్తీక్ ఆర్యన్ ప్రధాన పాత్రలో నటించనున్నాడని సమాచారం. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. దీంతో ఇప్పుడు శ్రీలీల, కార్తీక్ ఆర్యన్ పేర్లు తెగ వైరలవుతున్నాయి. ధర్మ ప్రొడక్షన్స్‌తో శ్రీలీల చర్చలు జరుపుతున్నట్లు టాక్. ఆమె ఫైనల్ అయితే అది ఆమె బాలీవుడ్ అరంగేట్రం అవుతుంది. బాలీవుడ్‌లో కార్తీక్ ఆర్యన్ సరసన శ్రీలీల స్టెప్పులేయనుందని టాక్. శ్రీలీల 2019లో 'కిస్' అనే కన్నడ చిత్రంతో తెరంగేట్రం చేసింది. ఆ తర్వాత పెళ్లి సందడి సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది.

# ఇక దబిడి దిబిడే..

బాలకృష్ణ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'డాకు మహారాజ్'. బాబీ కొల్లి దర్శకుడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రచార కార్యక్రమాల్ని ముమ్మరం చేశారు. బుధవారం 'దబిడి దిబిడే..' అంటూ సాగే మూడో పాటను విడుదల చేశారు. బాలకృష్ణ సినిమాలోని ఫేమస్ డైలాగ్ 'దబిడి దిబిడే' పేరుతో ఈ పాటను రూపొందించారు. తమన్ సంగీతాన్నందించిన ఈ గీతాన్ని కాసర్ల శ్యామ్ రచించారు. వాగ్దేవి ఆలపించింది. ఈ పాటలో బాలకృష్ణ, ఊర్వశి రౌతేలా నృత్యాలు ప్రధానాకర్షణగా నిలిచాయి. కొరియోగ్రాఫర్ శేఖర్ వీజే చక్కటి నృత్యరీతుల్ని సమకూర్చారు. అదిరిపోయే మాస్ స్టెప్పులతో ఈ పాట హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. ప్రగ్యాజైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్, చాందిని చౌదరి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: విజయ్ కార్తీక్, సంగీతం: తమన్, దర్శకత్వం: బాబీ కొల్లి.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com